క్లుప్తంగా

రెండు మండలాలు పర్చూరు ప్రాజెక్ట్‌లో విలీనం

బల్లికురవ: సంతమాగులూరు ఐసీడీఎస్, ప్రాజెక్టు పరిధిలో ఉన్న మార్టూరు, యద్దనపూడి మండలాలను ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం పర్చూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లో విలీనం చేశారని సీడీపీవో సుధ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంతమాగులూరు ప్రాజెక్ట్‌లో బల్లికురవ, సంతమాగులూరు, మార్టూరు యద్దనపూడి మండలాలున్నాయన్నారు. మార్టూరు, యద్దనపూడి మండలాల్లోని 120 అంగన్‌వాడీ కేంద్రాలను, మూడు సూపర్‌వైజర్‌లను పర్చూరు ప్రాజెక్ట్‌కు అటాచ్ చేశారని చెప్పారు.

సబ్సిడీపై యంత్ర పరికరాలు

చినగంజాం: మండలంలోని రైతులు 2022–23 సంవత్సరానికిగాను వ్యవసాయ శాఖ తరపున డాక్టర్ వైఎస్సార్ యంత్ర పథకంలో భాగంగా పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కే భాస్కరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 11 కస్టమ్ హైరింగ్ సెంటర్‌లు మంజూరు అయ్యాయని, వాటిలో ఆరు కస్టమ్స్ హైరింగ్ సెంటర్‌లు రైతులకు ఇచ్చామన్నారు. ఐదు కస్టమ్ హైరింగ్ సెంటర్‌లు రైతులకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. పథకంలో భాగంగా రైతులకు ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్ర పరికరాలు మొత్తం విలువ రూ.15 లక్షలు వరకు తీసుకోవచ్చని, 40 శాతం రాయితీ, 50 శాతం బ్యాంకు నుంచి రుణం, 10 శాతం రైతు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. కావాల్సిన రైతులు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో గాని మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో గాని సంప్రదించాలని కోరారు.

సాయిబాబాకు వెండి ఆభరణాలు బహూకరణ

చినగంజాం: స్థానిక హనుమసాయి కుటీరం నందు వేంచేసియున్న షిర్డి సాయిబాబా మందిరానికి దాతలు గానుగపాటి నరసింహరావు, ద్వారకా కుమారి దంపతులు వెండి ఆభరణాలు బహూకరించారు. సాయి మందిరంలోని ఆంజనేయ స్వామి, దత్తాత్రేయ స్వామి విగ్రహాలకు సుమారు రూ.50 వేలు విలువ కలిగిన వెండి వక్షస్థలం, కిరీట ఆభరణాలు వారు సమర్పించారు. ఇందులో భాగంగా సోమవారం ఆలయంలోని విఘ్నేశ్వర, సుబ్రమణ్యేశ్వర, అంజనేయ, దత్తాత్రేయ, సాయిబాబా విగ్రహాలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బాపట్ల వెంకటేశ్వర సాయి, శ్యామల దంపతులతో పాటు సేవాదళ సభ్యులు మాచవరపు ఆంజనేయులు, ప్రభాకర విఠల్‌రావు, పార్వతి, కళ్యాణి, పుల్లమ్మ పాల్గొన్నారు.



వేటపాలెంలో కార్మిక జెండా ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆమంచి


చినగంజాలో మేడే ర్యాలీలో పాల్గొన్న కార్మిక నాయకులు


అద్దంకి: మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా ఎగురవేస్తున్న కార్మికులు

కార్మిక లోకం వర్ధిల్లాలి

- ఊరూరా మేడే వేడుకలు
- జెండా ఎగురవేసిన కార్మికులు

వేటపాలెం/చీరాల టౌన్: 'కర్షక వీరుల కాయం నిండా, కాలువ కట్టే ఘర్మజలానికి, ఖరీదు లేదోయ్'.. అని శ్రీశ్రీ కన్నా గొప్పగా ఎవరూ చెప్పలేరు. కార్మికుడు లేని ప్రపంచాన్ని మనం ఊహించలేం.. ఈప్రపంచం మొత్తం కార్మిక శక్తి మీదనే ఆధారపడి పనిచేస్తుందంటే అతిశయోక్తి కాదు. సోమవారం నియోజకవర్గ వ్యాప్తంగా అంతర్జాతీయ మే డేను కర్షకులు, కార్మికులు ఘనంగా జరుపుకున్నారు. వేటపాలెం మండల పరిధిలో మేడే పురస్కరించుకొని వివిధ కార్మిక సంఘాలు యూనియన్ నాయకుల, కార్మికులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా కుందేరు వద్దగల భవన నిర్మాణ కార్మికుల యూనియన్ కార్యాలయం ఏర్పాటు చేసిన కార్మిక జెండాను మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ ఆవిష్కరించారు. అనంతరం స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో ఆటో యూనియన్, పెయింటర్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఏర్పాటు చేసిన జెండాలను ఆమంచి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమంచి మాట్లాడుతూ కార్మికుల లేని రంగం ఏదీ లేదన్నారు. ప్రతి రంగంలోనూ కార్మికులే దేశానికి పట్టుగొమ్మల్లాంటి వారని కొనియాడారు. చెక్క రిక్షా కార్మిక యూనియన్ గౌరవ అధ్యక్షుడు వుగ్గిరాల నరశింహరావు, జీడిపప్పు ఫ్యాక్టరీల వద్ద కార్మిక యూనియన్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. ఉభయ కమ్యూనిస్ట్ పార్టీల నాయకులు గడియార స్తంభం సెంటర్‌లో కార్మిక జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ యూనియన్ నాయకులు కె వెంకట్రావు, బాణాల లక్ష్మీనారాయణ, కూనపురెడ్డి వెంకట్రావు, పెయింటర్స్ యూనియన్ నాయకులు తమ్మినేని రాఘవయ్య, వడ్డే శేషయ్య, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు. ఈపురుపాలెంలో మార్కెట్ సెంటర్‌లో, జాండ్రపేట అయోధ్య నగర్‌లో మేడే వేడుకలు నిర్వహించారు.

'మేడే' స్ఫూర్తితో ఐక్యంగా ఉద్యమిద్దాం..

కారంచేడు/చినగంజాం/మార్టూరు/యద్దనపూడి: 'మేడే' స్ఫూర్తితో నేటి కార్మికులందరూ ఐక్యంగా ఉద్యమించాల్సి ఉందని సీఐటీయూ జిల్లా నాయకులు పీ కొండయ్య, బీ శంకర్‌లు అన్నారు. సోమవారం మేడే పురస్కరించుకొని మండల కేంద్రమైన కారంచేడు కాలువ సెంటర్‌లో సీఐటీయూ మండల శాఖ అధ్యక్షురాలు అనిత అధ్యక్షతన సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. కార్మికుల ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేశారు. అనంతరం చీరాల రోడ్డులోని ఆర్‌సీఎం చర్చి సమీపంలో జెండాలు ఎగురవేశారు.

■ చినగంజాం, పెదగంజాం, సంతరావూరు గ్రామాల్లో కార్మికులు మేడే వేడుకలు నిర్వహించారు. మండల కేంద్రం చినగంజాంలో ఉప్పు కార్మికులు, ఆటో కార్మికులు, రిక్షా కార్మికులు, ఆశ కార్యకర్తలు, పంచాయతీ కార్మికులు మేడే వేడుకలను నిర్వహించారు. కార్మికులంతా ఎర్ర జెండాలు చేతబట్టి, ఎర్ర కండువాలను తలకు చుట్టి కార్మిక ఐక్యతను కోరుతూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

■ వెట్టిచాకిరి నశించాలి.. కార్మికుల ఐక్యత వర్ధిల్లాలంటూ నినాదాలతో మార్మోగిపోయింది. తీన్మార్‌లు, గులాములు చల్లు కోవటంతో పర్చూరు బొమ్మల సెంటర్ హోరెత్తింది. అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం మేడేని పురస్కరించుకొని పర్చూరులో ఘనంగా నిర్వహించారు. కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం సకాలంతో అందేలా చూడాలని, కార్మికులను సత్వరం ఆదుకోవాలని నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బేల్దారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు షంషుద్దీన్, అంకమ్మ, కార్యదర్శి షుకూర్, కార్మికులు పాల్గొన్నారు.

■ మార్టూరు స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో బత్తుల హనుమంతరావు జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. స్థానిక గన్నవరం రోడ్డులో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కమాలుద్దీన్ జెండా ఆవిష్కరణ చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఓపీడీఆర్ బాషా, బెంజిమన్, సుజాత, ఖాజావలి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

■ రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులకు 35 మందికి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు కొర్రపాటి కాజారావు, మాజీ అధ్యక్షుడు చెన్నుపాటి బసవరాములు, కాజా హుస్సేన్, ఏరియా యూత్ చైర్మన్ రావి అంకమ్మ చౌదరి, మండల సీఐటీయూ కార్యదర్శి హనుమంతరావు, సూరిబాబు, పంచాయతీ కార్మికులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కార్మిక శక్తి వర్ధిల్లాలి..

అద్దంకి/అద్దంకి రూరల్/జే.పంగులూరు/బల్లికురవ/మేదరమెట్ల: కార్మికుల దినోత్సవం మేడే పర్వదినాన్ని కొరిశపాడు మండలంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మేదరమెట్లలో సీపీఎం, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ బొమ్మ సెంటర్‌లో జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. రావినూతల, ప్రాసంగులపాడు, పమిడిపాడు గ్రామాలలో కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు కార్మిక జెండా ఎగురవేశారు.

■ అద్దంకిలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక భవాని సెంటర్‌లో రిక్షా వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. ఆర్టీసీ డిపోలో ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో, బస్టాండ్ ఆవరణలో పండ్ల వ్యాపారుల ఆధ్వర్యంలో, అద్దంకి మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షురాలు శారద, ఎస్‌డబ్ల్యూఎఫ్ బాపట్ల జిల్లా నాయకుడు తిరుపతిరెడ్డి, ఎస్కే షంషావలి, మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ నాయకుడు కెపి రాజు, మున్సిపల్ వర్కర్లు పాల్గొన్నారు.

■ కార్మికుల భాస్వామ్యం లేకుండా అభివృద్ధి ఊసే లేదని అలాంటి కార్మికులను గౌరవించాల్సిన బాధ్యత ప్రతిక్కరిపై ఉందని తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. బల్లికురవలో నాలుగు రోడ్ల కూడలి సమీపంలో జెండా ఆవిష్కరణతో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు షేక్ ఖాదర్, మన్నం ఏసు, బండి శ్రీను, జంధ్రాజుపల్లి వాసు, ఎలీశా, పేతురు, తదితరులు పాల్గొన్నారు.

చీరాల: స్థానిక పేరాలలో సీఐటీయూ కార్యాలయం వద్ద సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. మార్కెట్ ఐఎల్‌టీడీ యూనియన్, మున్సిపల్ ఆఫీసు, సీఐటీయూ కార్యాలయం వద్ద, గడియార స్తంభం సెంటర్ వద్ద టాక్సీ డ్రైవర్స్ యూనియన్, ఏపీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్, హైయర్ బస్ వర్కర్స్ యూనియన్, ఎల్ఐసీ యూనియన్ కార్యాలయాల వద్ద జెండా ఆవిష్కరణలను చేశారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోటి దాసు కార్మికులు పాల్గొన్నారు.


మేదరమెట్లలో వేడుకల్లో పాల్గొన్న సీపీఎం, కార్మిక నాయకులు


బల్లికురవలో మేడే జెండా ఆవిష్కరణ..


వేటపాలెంలో కార్మిక జెండా ఆవిష్కరించిన రిక్షా యూనియన్ నాయకులు


మార్టూరు సీఐటీయూ కార్యాలయం వద్ద మేడే వేడుకలను నిర్వహిస్తున్న నాయకులు


కారంచేడులో జెండా ఆవిష్కరణలో సీఐటీయూ నాయకులు, కార్మికులు


చీరాల పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మండల నాయకులతో ఆమంచి సమావేశం


మార్కెట్ యార్డులో పర్యటిస్తున్న ఆమంచి

మార్టూరు: మార్టూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ సోమవారం మధ్యాహ్నం మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో ఇప్పటి వరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించుకోవాల్సిన గ్రామాలపై నాయకులతో చర్చించారు. అనంతరం స్థానిక రైతు భరోసా కేంద్రాన్ని, మార్కెట్ యార్డును పరిశీలించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ఆయా గ్రామాల నాయకులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులతో పాటు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

కారంచేడులో భారీ వర్షం


మిరప కల్లాల్లో పరదాలు కప్పిన రైతులు

కారంచేడు: సోమవారం వేకువజామున కారంచేడు మండలంలోని అన్ని గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో మిరప, పొగాకు రైతులు ఇబ్బందులు పడ్డారు. పంటలు చేతికందే తరుణంలో అకాల వర్షాలతో రైతన్నలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మండలంలోని దగ్గుబాడు, పోతినవారిపాలెం, నాయుడువారిపాలెం, జరుబులవారిపాలెం, కేశవరప్పాడు గ్రామాల ప్రాంతాల్లో మిరప సాగు విస్తారంగా ఉంది. ప్రస్తుతం మిరప చేలల్లో మొదటి కోతలు అయ్యి వాటిని ఎండబెట్టుకొనే స్థితిలో కొందరుంటే, మరికొంత మంది రైతులు రెండో కోతలు కోసి వాటిని కల్లాల మీదనే ఉంచారు. వర్షానికి కాయ మెత్త బడటంతో పాటు, చెట్టుకు ఉన్న కాయ కూడా కొంత తాలు కాయలుగా ఏర్పడే ప్రమాదముందని రైతులు వాపోతున్నారు.

ప్రతి శనివారం హౌసింగ్ డే

మేదరమెట్ల: గ్రామాల్లో ఇప్పటికే నిర్మాణంలో ఉన్న ఇళ్లను మానిటరింగ్ చేయడం, అలాగే ప్రతి శనివారం రోజున అధికారులు హౌసింగ్ డేగా పాటించి జగనన్న కాలనీల్లో నిర్మాణంలో ఉన్న లేని ఇళ్లను పరిశీలించాలని ఎంపీడీవో సురేష్‌బాబు పేర్కొన్నారు. కొరిశపాడు మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, హౌసింగ్ అధికారులతో కలసి సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎండీవో సురేష్‌బాబు

కోతుల బెడద వదిలించిన సర్పంచ్


కోతులను పట్టి తరలిస్తున్న సర్పంచ్, ఉపసర్పంచ్

చినగంజాం: మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో గత కొంతకాలంగా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న కోతుల బెడదను వదిలించేందుకు చినగంజాం మేజర్ పంచాయతీ సర్పంచ్ రాయని ఆత్మారావు నడుం బిగించారు. మండలంలోని చినగంజాం, కడవకుదురు, కొత్తపాలెం, మున్నం వారిపాలెం గ్రామ పంచాయతీల్లో కోతులు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేశాయి. పంచాయతీ కార్యదర్శి ఆళ్ల మస్తాన్‌రావు సర్పంచ్ ఆత్మారావు చొరవతో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పంచాయతీ నిధులు సుమారు రూ.1 లక్ష వరకు వెచ్చించి గత కొన్ని రోజులుగా కోతుల పట్టుకునే ప్రత్యేక బృందాన్ని మండలానికి రప్పించి వారికి గ్రామంలో ఆశ్రయం కల్పించి గ్రామంలోని సుమారు 60కి పైగా ఉన్న కోతులను పట్టించారు. కార్యక్రమంలో పంచాయతీ ఉప సర్పంచ్ చెరుకూరి రాఘవరావు, కార్యదర్శి మస్తాన్‌రావు, ఇతర వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మదనగోపాలస్వామికి లక్ష మల్లెలార్చన

చీరాల అర్బన్: పట్టణంలోని పేరాలలో వేంచేసియున్న మదనగోపాలస్వామి వారి దేవాలయంలో సోమవారం 44వ వార్షిక లక్ష మల్లెల పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారికి ప్రభాత సేవ, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం స్వామివారికి లక్ష మల్లెలతో విష్ణు సహస్రనామ పూజా కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి సుగంధ పరిమళ లక్ష మల్లెల పూలతో పుష్పాలంకారము నిర్వహించారు. పూజా కార్యక్రమాలను అర్చకులు ఆర్కే వెంకట రంగాచార్యులు, చెన్నకృష్ణమాచార్యులు నిర్వహించారు. కార్యక్రమాలను దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి జీవీఎల్ కుమార్ పర్యవేక్షించారు.

ఘనంగా టీటీడీ చైర్మన్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి: తిరుమల తిరుపతి దేవస్థాన పాలక మండలి అధ్యక్షుడు వైవీ సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ పట్టణ నాయకుడు కాకాని రాధాకృష్ణమూర్తి కార్యాలయంలో సోమవానం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ సుబ్బారెడ్డి అధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థాన సేవలకు సంబంధించి విప్లవాత్మకమైన మార్పులను తెచ్చారన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా వసతులు కల్పించడంలో ఆయనకు ఆయనే సాటి అన్నారు.

మేదరమెట్ల: టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పుట్టిన రోజు వేడుకలను మేదరమెట్ల గ్రామంలో సోమవారం ఆయన అభిమానులు వైభవంగా నిర్వహించారు. మేదరమెట్ల మాజీ సర్పంచ్ జజ్జర ఆనందరావు స్థానిక నాయకులతో కలసి అద్దంకిలోని బధిరుల ఆశ్రమంలోని చిన్నారులకు పండ్లు, ఫలహారాలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా వైవీ పుట్టిన రోజు కేక్‌ను కట్‌చేశారు. కార్యక్రమంలో అడ్వకేట్ వై.రమేష్‌బాబు, మేదరమెట్ల మాజీ ఎంపీటీసీ జ్యోతి రమేష్ తదితరులు పాల్గొన్నారు. మేదరమెట్ల సర్పంచ్ బొనిగల ఎలిశమ్మ, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ కోయి అంకారావు, స్థానిక నాయకుల ఆధ్వర్యంలో మేదరమెట్ల వైఎస్సార్ విగ్రహం వద్ద కృష్ణచైతన్య వైవీ పుట్టిన రోజు కేక్ కట్ చేసి, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ అంకారావు టీటీడీకి రూ. 5 లక్షలు విరాళం ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ శ్రేణులు, వైవీ అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


బధిరుల ఆశ్రమంలో చిన్నారులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఆనందరావు


చెక్కు ఇస్తున్న దాత అంకారావు

– అద్దంకి పట్టణం, బంగ్లా రోడ్ చిన్ని శాంతా భవనం దగ్గర ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం ట్రస్టు బోర్డ్ మాజీ చైర్మన్ చిన్ని శ్రీమన్నారాయణ గారి ఆధ్వర్యంలో సుబ్బారెడ్డి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు.

250 మందికి అన్నదానం

చీరాల: టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి జన్మదినం సందర్భంగా సోమవారం స్థానిక పేరాలలోని భ్రమరాంబ సమేత పునుగు రామలింగేశ్వరస్వామి దేవాలయంలో దేవస్థాన కమిటీ చైర్మన్ గోలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 250 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండీ తాడివలస దేవరాజు మాట్లాడుతూ అన్ని దానాల్లో కన్నా అన్నదానం విశిష్ట మైనదన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రాజశేఖర్ శర్మ, కమిటీ సభ్యులు సంకా మురళీకృష్ణ, బలగం శెట్టిఅంకమ్మరావు, గంజి గాంధీ, ఈవో జీవీఎల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


చీరాల: అన్నదానం చేస్తున్న నాయకులు

10 క్వింటాళ్ల గడ్డి విత్తనాలు స్వాధీనం

అద్దంకి రూరల్: అనుమతులు లేకుండా ప్యాకింగ్ చేసి అక్రమంగా తరలిస్తున్న 10 క్వింటాళ్ల గడ్డి విత్తనాలను సోమవారం మండలంలోని అడవిపాలెం గ్రామంలో వ్యాపారి కల్లూరి శ్రీనివాసరావు నుంచి గుంటూరు రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం ప్రకారం.. గుంటూరు రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి బీ. భవాని హర్ష పర్యవేక్షణలో డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆకస్మిక తనిఖీలో కల్లూరి శ్రీనివాసరావు ఏ విధమైన అనుమతులు లేకుండా గడ్డి విత్తనాలు సేకరించి ప్యాకింగ్ చేసి రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు, వేరే రాష్ట్రాలకు అధిక మొత్తానికి అమ్మకాలు చేసున్నాడు. 10 క్వింటాళ్ల గడ్డి విత్తనాలు 50 సంచుల్లో ప్యాకింగ్ చేశారు. సుమారు రూ.1 లక్ష విలువ ఉంటుందన్నారు. ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ వ్యవసాయాధికారిణి జే. వాసంతి, ఇన్స్‌స్పెక్టర్ ఎ. శ్రీహరిరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేణుకాదేవి ఆలయంలో ప్రతిష్ట

బల్లికురవ: మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో చిటిపోతువారి ఇలవేల్పు రేణుకాదేవి ఆలయంలో సోమవారం ప్రతిష్ట మహోత్సవాలకు అంకురార్పణ చేశారు. అర్చకులు మేళ్ల చెరువు ఉదయ్‌భాస్కర్‌చే గోపూజ వేదరస్వస్తి, గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, దీక్షా వస్త్రా కంకణ ధారణ, అఖండ స్థాపన, నవగ్రహ మండపారాధన, అమ్మవారి కలశ స్థాపన, అగ్ని ప్రతిష్ట, చండీ హోమం చేపట్టారు. వేడుకల్లో గ్రామంతోపాటు, పరిసర గ్రామాల భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

కార్మికుల కోసం సొసైటీ ఏర్పాటు అభినందనీయం



కార్యక్రమంలో మాట్లాడుతున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

బల్లికురవ: గ్రానైట్ క్వారీలు పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల కోసం స్థానిక యువత బల్లికురవలో కార్మిక న్యాయ సంక్షేమ సొసైటీని ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. మేడే సందర్భంగా సోమవారం బల్లికురవలో ఏర్పాటు చేసిన కార్మిక న్యాయ సంక్షేమ సొసైటీని చైతన్య లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు పనులు చేసేటప్పుడు భద్రతా చర్యలు పాటించాలన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న ఈ–శ్రమ కార్డులు కార్మిక శాఖ అందజేస్తున్న ఐడీ కార్డులు, ప్రతి ఒక్కరూ పొందాలన్నారు. ప్రభుత్వ పరంగా తన సహకారం ఎల్లవేళలా కార్మికులకు అందజేస్తానని ప్రకటించారు. ఎంపీ ఫౌండేషన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ భాస్కర్ మాట్లాడుతూ గ్రానైట్ క్వారీలు పరిశ్రమల్లో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలన్నారు. పనులు చేసేటప్పుడు భద్రతా చర్యలతో పాటు నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. సొసైటీ ప్రారంభంలో భాగంగా చైతన్య కార్మికులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా రైతు అధ్యక్షుడు మండల పార్టీ కన్వీనర్ చింతల పేరయ్య, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ, నక్కబొక్కలపాడు, మల్లాయపాలెం సర్పంచ్‌లు ధూళిపాళ రామయ్య, జూపల్లి రాఘవరావు, కోర్డినేటర్ పీ. హరిహరరెడ్డి, స్థానిక నేతలు చింతల శ్రీనివాసరావు, మాదాల శివన్నారాయణ, బండి గంగా ప్రసాద్, చిలకా మధుబాబు, మందా వీరనారాయణ, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.